

# రేవంత్-అదానీ దోస్తానా.. బీఆర్ఎస్ నిరసన

- అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డగింత..
- ఎమ్మెల్యేలు పల్లా, పాడి, ఎమ్మెల్సీ పోచంపల్లి అరెస్ట్

'సీఎం రేవంత్‌రెడ్డి-అదాని దోస్తీ'పై వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో టీ షర్టులతో నిరసన తెలిపారు. జనగామ, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాలకు రాకుండా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు.

# ఎక్కడికక్కడే అదుపులోకి..

- మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు
- చలో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 9: పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు సోమవారం చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తాము అప్పులు చేసి పనులు చేశామని, తమకు రావాల్సిన బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకుండా మానసిక క్షోభకు గురిచేస్తున్నదని అన్నారు. బిల్లులు చెల్లించాలని నిరసన తెలిపేందుకు బయలుదేరిన తమను నిర్బంధించడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పోలీసు పాలన నడిపిస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న జనగామ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షురాలు శారద


జనగామ రూరల్ : హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జనగామ జిల్లా మాజీ సర్పంచులను అరెస్టు చేస్తున్న పోలీసులు


హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో..


చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌లో..


ములుగు రూరల్ : ములుగు పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు


ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

# కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత ఇవ్వాలి

- 60శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి
- కాజీపేటను డివిజన్‌గా ప్రకటించాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నేతల ధర్నా

హనుమకొండ, డిసెంబర్ 9 : ఎన్నో ఏండ్ల కల, అనేక ఉద్యమాల ద్వారా సాధించుకున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. ఇక్కడ దాస్యం మాట్లాడుతూ కాజీపేట సమస్యలపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదన్నారు. అనేక వర్గాల ప్రజలతో కలిసి ఎన్నో ఉద్యమాలు చేసి కోచ్ ఫ్యాక్టరీ సాధించుకున్నామని పేర్కొన్నారు. ఈ తరుణంలో పార్లమెంట్ సమావేశాల్లోనే విధివిధానాలు ప్రకటించాలని, కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా మార్చాలని, రైల్వే స్ట్రీట్ వెండర్స్‌కు స్టేషన్ ముందు స్థలంలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రైల్వే స్టేడియంలో బస్టాండ్ స్థలాన్ని కేటాయించాలని, బోడగుట్ట ప్రజలకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే 60శాతం ఉద్యోగాలు ఇవ్వాలని దాస్యం డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ సమావేశంలో ప్రకటించాలని, లేకపోతే అన్ని వర్గాల ప్రజలతో గల్లీ నుండి ఢిల్లీ దాకా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, నార్లగిరి రమేశ్, కార్పొరేటర్ సంకు నర్సింగ్‌రావు, గబ్బెట శ్రీనివాస్, శిరుమల్ల దశరథం, దువ్వ కనుకరాజ్, ఎండీ అఫ్జల్, కొండ్ర శంకర్, ఎండీ హుస్సేన్, సుంచు అశోక్, బరిగెల వినయ్, రాబర్ట్ జోసఫ్ పాల్గొన్నారు.

# సిగ్నల్స్ పనిచేయక రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత

**ఉప్పల్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు**

కమలాపూర్, డిసెంబర్ 9 : మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పడిన సాంకేతిక లోపంతో రైళ్ల హాల్టింగ్‌ను అధికారులు నిలిపివేశారు. ఈ నెల 8న ఉదయం 9.30 గంటలకు టెక్నికల్ ప్రాబ్లంతో సిగ్నల్స్ వ్యవస్థ దెబ్బతిింది. దీంతో రైల్వే అధికారులు పెద్ద ఎత్తున ఉప్పల్‌కు చేరుకుని సిగ్నల్స్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు మరమ్మతులు చేపట్టారు. పనులు జరుగుతుండడంతో రైల్వే స్టేషన్‌లో భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సింగరేణి, రామగిరి ప్యాసింజర్ రైళ్ల హాల్టింగ్ ఎత్తివేశారు. దీంతో ఉప్పల్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు రైల్వేగేట్ ఇంటర్ లాక్ ఓపెన్ చేయడంతో పరకాల-హుజూరాబాద్ రహదారిపై వాహనాలు యథావిధిగా నడుస్తున్నాయి. రెండు రోజులుగా సిగ్నల్స్ పునరుద్ధరించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాగా తాత్కాలికంగా మెయిన్ ట్రాక్ సిగ్నల్స్ కనెక్షన్ ఇచ్చి నడిపిస్తున్నారు.

# మా జోలికొస్తే ఊరుకోం

**కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్‌కు ఉమ్మడి వరంగల్ వెలమ కులస్తుల హెచ్చరిక**

- బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ధర్నా, ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం


షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా హనుమకొండ ఏకశిల పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న వెలమ కుల సంఘం నాయకులు

హనుమకొండ, డిసెంబర్ 9 : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెలమ కులస్తులు మండిపడ్డారు. తమ జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ఎదుట ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేసి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఉషా దయాకర్‌రావు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెలమలను ఎవరుపడితే వారు విచ్చలవిడిగా మాట్లాడితే ఊరుకోమన్నారు. తెలంగాణ సాధించిన వ్యక్తి కేసీఆర్ అని, ఆయనను తిట్టినా ఊరుకొనే ప్రసక్తే లేదన్నారు. సమాజ సేవలో వెలమలు ముందుంటారని, ఉన్నదాంట్లో ఇతరులకు సహాయం చేసిన చరిత్ర వారికి ఉందన్నారు. వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రావు మాట్లాడుతూ వెలమ జాతిని తొక్కేస్తామని, చంపేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే బెదిరించారని, ఇలాంటి మాటలు సరికాదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శంకర్ క్షమాపణ చెప్పకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వెనుక ఉండే మాట్లాడిస్తున్నారని అన్నారు. 'మమ్ములను షాద్‌నగర్‌కు రమ్మంటావా.. నీవు వరంగల్‌కు వస్తావా' అని ఎమ్మెల్యే శంకర్‌కు సవాల్ విసిరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బోయినపల్లి రంజిత్‌రావు, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కేశవరావు, వెంకటేశ్వర్‌రావు, దుర్గారావు, ఉపేందర్‌రావు, దేవేందర్‌రావు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉషాదయాకర్‌రావు

# అయ్యప్ప.. శరణు శరణు

**వైభవోపేతంగా పంబారట్టు**

- మాలధారులతో కిటకిటలాడిన మాధన్నపేట పెద్దచెరువు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది దంపతులు


నెయ్యితో అయ్యప్పకు అభిషేకం చేస్తున్న గురుస్వామి





నర్సంపేట శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 24వ మండల పూజ మహోత్సవాల్లో భాగంగా మండలంలోని మాధన్నపేట పెద్ద చెరువులో అయ్యప్ప స్వామి పంబారట్టు ఉత్సవాలు సోమవారం వైభవోపేతంగా జరిగాయి. గురుస్వామి సీ వెంకటేశ్‌శర్మ ఆధ్వర్యంలో హరిహర సుతుడి ఊరేగింపు, జల క్రీడలు, అభిషేకాలు కనులపండువగా కొనసాగాయి. వేలాది మంది మాలధారులతో చెరువు ప్రాంతం కిటకిటలాడగా.. ఆ ప్రాంతమంతా శరణుఘోషతో మార్మోగింది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- నర్సంపేట రూరల్, డిసెంబర్ 9

# రుణమాఫీ ఎప్పుడు చేస్తరు?

- ఆఫీసుల చుట్టూ తిరిగి యాష్టకొస్తున్నది
- వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్ల ఎదుట రైతుల నిరసన


వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నెక్కొండ మండలం అలంకానిపేట రైతులు

ఖిలావరంగల్/మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 9: రుణమాఫీ ఎప్పుడు చేస్తరు? బ్యాంకు, వ్యవసాయ ఆఫీసుల చుట్టూ తిరిగి యాష్టకొస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట, మహబూబాబాద్ మండలం మాధవాపురం, కురవి మండలం బంజారాతండా రైతులు ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అర్హులైన రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదన్నారు. నెక్కొండలోని ఐవోబీలో 1500 మంది రైతులకు ఖాతాలుండగా ఇందులో 600 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. మిగతా 900 మందికి అధికారుల తప్పిదంతో మాఫీ జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి బ్యాంకులు, వ్యవసాయ అధికారులకు ఆధార్ కార్డ్‌లు, పాస్‌బుక్స్ జిరాక్స్‌లు ఇస్తున్నా రుణ మాఫీ మాత్రం కావడం కాలేదని పేర్కొన్నారు. రేషన్‌కార్డ్ లేదని, ఆధార్‌లో పేరు తప్పుగా ఉందని సాకులు చెబుతున్నారని, ప్రభుత్వం కూడా సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులు పెడుతున్నదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు జీ సంధ్యారాణి, వీరబ్రహ్మచారికి రైతులు వినతి పత్రాలు సమర్పించారు.


మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

## సన్న, చిన్నకారు రైతులకే రుణం మాఫీ కాలేదు




ఐవోబీలో రూ.లక్షలోపు రుణం ఉన్న రైతులం 50 శాతం ఉన్నం. ప్రభుత్వం రుణ మాఫీ చేసినం అంటున్నది. చేస్తే మాకు ఎందుకు కాలేదు. సన్న, చిన్నకారు రైతులకే రుణమాఫీ కాలేదు. రేషన్ కార్డని, ఆధార్ కార్డని ఏవేవో సాకులు చెబుతూ రోజులు దాటవేస్తున్నది. వెంటనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. రూ.లక్షా 25 వేలు రుణం తీసుకుంటే మాఫీ కాలేదు.

- రాజిరెడ్డి, అలంకానిపేట, నెక్కొండ

# ఇంటెలిజెంట్ గర్ల్స్ రక్షిత, మైథిలి

**మీ ఆలోచన అద్భుతం.. ప్రతిభకు వందనం**


విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్ ఇదే

- మద్యం సేవిస్తే వాహనం నడవకుండా పరికరం తయారీ
- రామన్నగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రత్యేకత
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఎగ్జిబిట్
- రాష్ట్రం నుంచి ఎంపికైనవి రెండే.. జనవరి 2న రాష్ట్రపతిని కలిసే అవకాశం

ఏటూరునాగారం, డిసెంబర్ 9 : పేదరికంలో పుట్టినా తమ ఆలోచనలతో అద్భుతాలను సృష్టిస్తున్నారు ఇద్దరు విద్యార్థినులు. పలు పరికరాల తయారీలో ప్రతిభ కనబర్చి ప్రముఖుల ప్రశంసలందుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర, సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫేర్లలో వారు రూపకల్పన చేసి ప్రదర్శించిన ఎగ్జిబిట్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడంతో పాటు రాష్ట్రపతిని కలుసుకునే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడేనికి చెందిన గార రక్షిత, గార మైథిలి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. చిన్నప్పటి నుంచే పలు పరికరాలు తయారు చేసే వీరు తాజాగా 'ఇంటెలిజెంట్ ఆల్కహాల్ డిటెక్షన్ వెహికిల్ అలర్ట్ సిస్టం ఫర్ డ్రైవర్స్' అనే ఎగ్జిబిట్‌ను రూపొందించారు. గత ఏడాది డిసెంబర్‌లో నిర్మల్ జరిగిన రాష్ట్ర స్థాయి, జనవరి 27 నుంచి 31 వరకు విజయవాడలో జరిగిన సౌత్ ఇండియా (ఆరు రాష్ట్రాల స్థాయి) సైన్స్ ఫేర్‌లో ఈ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. దీంతో నిర్వాహకులు హర్యానాలో ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి సైన్స్ ఫేర్‌కు వీరిని ఎంపిక చేశారు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి 30 ప్రాజెక్టులను పంపించగా రెండు ఎగ్జిబిట్లు మాత్రమే ఎంపికయ్యాయి. అందులో రక్షిత, మైథిలి రూపొందించిన పరికరం ఒకటి. వీరు తయారు చేసిన పరికరాన్ని వాహనాలకు బిగించి శాటిలైట్‌కు అనుసంధానం చేయడం వల్ల డ్రైవర్లు మద్యం సేవించినప్పుడు ఇంజిన్ ఆన్ కాకుండా ఉంటుంది. అంతే కాకుండా వారు మద్యం సేవించిన సమాచారాన్ని స్థానిక పోలీసులతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబీకులకు పంపిస్తుంది. దీంతో వారు అలర్ట్ అయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఇద్దరు విద్యార్థినులు నిరుపేద కుటుంబానికి చెందిన వారని వారి గైడ్ టీచర్ శ్యాంసుందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌లో పాల్గొన్న అనంతరం జనవరి 2న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతిని కలువనున్నారని, ఈ మేరకు వారికి ఆహ్వానం అందినట్లు ఆయన పేర్కొన్నారు.


ఎంపికైన విద్యార్థులు రక్షిత, మైథిలి

**విద్యార్థులను సన్మానించిన ఎస్సై**

రక్షిత, మైథిలిని సోమవారం స్థానిక ఎస్సై తాజుద్దీన్ సన్మానించారు. హర్యానా వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని మండల కేంద్రానికి చెందిన డాక్టర్ వరప్రసాద్‌రావుతో పాటు మరో ఇద్దరు అందిస్తున్నట్లు పాఠశాల ఉపాధ్యాయుడు కోడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎవరైనా దాతలు సహకరించి ఆదుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్న అధికారులు

# మినీ మేడారం భక్తులకు మిషన్ భగీరథ నీళ్లు

తాడ్వాయి, డిసెంబర్ 9 : వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మల మినీ జాతర కోసం వచ్చే భక్తులకు మిషన్ భగీరథ నీరందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఈఈ మాణిక్యాలరావు, డీఈఈలు సునీత, సతీశ్‌తో పాటు ఏఈలు జాతర పరిసరాల్లో పర్యటించి ప్రధాన ట్యాంక్‌లతో పాటు మినీ ట్యాంకులను పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే చిలుకలగుట్ట, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, రెడ్డిగూడెంలో విడిది చేసే భక్తులకు తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్ల ఏర్పాటును పరిశీలించారు. కొత్త బోర్లు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.